కవితా కౌముది

# ముళ్ళపాన్పుపై మూగ మూలుగు

బాలాజీ పోతుల

కష్టాల కడలి ఈదుతున్నాళ్ళూ,
ఆనంద తీరాన చేరలేకపోయాడు.
అలల తాకిడితో ఆత్మ కరుగుతూ,
జీవితం పయనమే అని ఒప్పుకోలేకపోయాడు.

దారి నిండా ముళ్ళు పడుతూ,
పాదాల గీతల్లో రక్తం చిందించాడు.
తొందరలోనే వెలుగు వస్తుందని,
గుడి గోడలతో మొక్కులు పెట్టాడు.

సహనపు సరళిపై భారం మోస్తూ,
గమ్యాన్నే ఎదురు చూసి చింతతో కూర్చున్నాడు.
గాలికి పోయిన పడవలా ఒంటరిగా,
నింగి చూస్తూ నేలకి మొరపెట్టాడు.

సముద్రపు గుండెల్లో నిలిచిపోతూ,
ఆత్మకు భరోసా లేకుండా పోయింది.
కష్టాల కొలనులో మునిగిపోతూ,
ప్రతి ఆశకూ చెమ్మ చేరుతోంది.

తీరాన దారిలోనే అడుగులు ఆగుతున్నాయి,
తనను తాను కోల్పోతున్నాడు.
కానీ ఎక్కడో ఆశలు మిగిలి ఉన్నాయి,
చీకటి చివర వెలుగు ఎదురుచూస్తుంది.

తీరానికి కష్టానికి మధ్య,
ఒక నడవడే తనను రక్షిస్తోంది ★★★



## కాలం
### శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ

కాలం.... చాలా బరువైనది
అంతేకాదు....
విశ్వాంతరాళాల బరువునూ
మోస్తూ గమిస్తుంది....
తన ప్రయాణంలో
కర్తవ్యాన్ని క్రమీకరిస్తూ
ఎంత బరువుగా సాగిపోతుందో..

లీలగా గోచరించే కాలగమనంలో
అనంత జీవన తరంగాల నాదాలు
కనిపించక నడిచిపోతూ
నడిపించే క్షణాలలో
నిశ్శబ్దంగా గోచరించే
అనుబంధాలు....అనుభూతులు....

ఖండఖండాలుగా విభజించిన
కాల గమనానికి
రేఖవళ్ళు సాదృశ ప్రమాణాలు
దృశ్యము.... అదృశ్యము
రెంటినీ సమంగా సమీకరించి
మన ముందుంచే కర్తవ్య కెరటం కాలం!

★★

## నేను
### అయ్యగారి లక్ష్మణరావు

నేను నేను అనుకొనే
నీకైనా నాకైనా
తప్పవురా తిప్పలు
ముప్పులొచ్చినప్పుడు

ఇప్పుడొద్దు ఇప్పుడొద్దు
అనుకున్నకాని
ఎప్పుడో ఒకప్పుడు
చావు కూడ తప్పదు

నేను నేను అనుకోడం
ఎందువలన అనుకున్నావ్
నాది నాది అనుకోడం
అదికూడా అందువలనే

ఈ రెండిటి ఎరుక నీకు
ఎందువలన వచ్చిందో
ఆలోచించి చూడడమే
ఆత్మ బోధ అవసరం
సంసారమనే బంధానికి
తుదినిచ్చే సమాధానం.

★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

జీవితము మిథ్య యంచును చెప్పుచుంద్రు
మిథ్య యైనచో నేనును మిథ్యనౌదు
మిథ్యయని చెప్పు బుద్ధియు మిథ్య యౌను
మిథ్యను గ్రహింప సాధ్యము మిథ్యకెట్లు?

సత్యమని తోచు జీవితక్షణములన్ని
సత్యమని తోచు గోచరజగతి యెల్ల
సత్యమని తోచెడు స్వపరజనములెల్ల
అరయలేనివి కూడ సత్యములు కలవు

అర్థవంతము జీవనయానమెపుడు
నిజము కాదని పయనమ్ము నిలుపగలమె?
విస్మరింపగనగునె జీవితమునెపుడు?
మాయయంచును బాధ్యతల్ మరవగలమె?

మేను విడచిన యాప్తులు మిథ్య కారు
నిన్న యుండిరి మన కనుసన్నలందు
మిత్రులెచటికో యేగిన మిథ్య కారు
నిన్న మొన్న దాక మన సన్నిధిని గలరు

కనుల ముందర గోచరించునది నిజము
కంటికాననిదెల్లను కాదు మిథ్య
ప్రస్ఫుటముగ కన్పించునీ ప్రకృతి నిజము
తలపుకందని రోదసీతలము నిజము

COMMENTS